بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 12.07.2019 (Telugu)**

## జల్సా సాలానా జర్మని విజయవంతమైనందున అల్లాహ్ తఆలా శుభముల ఆసక్తికర ప్రస్తావన అతిథుల మధురమైన, విశ్వాసభరిత అభిప్రాయములు

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 12.07.2019 తేదీన -- మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా కృపానుసారము అహ్మదియ్య జమాఅత్ జర్మని జల్సా సాలానా (వార్షిక సభ) అల్లాహ్ తఆలా అనుగ్రహములతో విజయవంతంగా ముగిసినది. కావున మనము మరింత అధికముగా అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపుచు మన ప్రయత్నములను ఇంకా పెంచుకోవాల్సిన అవసరమున్నది. తద్వారా అల్లాహ్ తఆలా శుభములు, అనుగ్రహములు కూడ పెరుగును. అసాధారణ వాతావరణము, ప్రభావమును మేము తిలకించినామని జల్సాలో పాల్గొన్న వందలాది జమాఅతేతర, ముస్లిమేతర అతిథులు అభిప్రాయపడిరి. కనుక మన జల్సా మన శిక్షణతో పాటు ప్రచారమునకు కూడ ఒక గొప్ప సాధనముగా ఉపయోగపడుతుంది. ఇందుకు మనము అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపుటలో ముందడుగు వేయాలని ఇది సూచించుచున్నది. ఈ వాతావరణము మనకు తాత్కాలికమైనది కాకూడదు. మన జీవితములోని ప్రతి క్షణము ఇస్లాం అందమైన బోధనను చూపించవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసిన ఉద్దేశమును అనుక్షణం పూర్తి చేయవలెను.

జల్సాలో సేవలందించిన వారికి కృతజ్ఞతలు తెలుపుచు హుజూరె అన్వర్ ఇట్లనిరి. సేవకులు జల్సా నిర్వహణకు తమ స్వంత ప్రయోజనాలను వీడి, తమ పనులను విస్మరించి జల్సా పనులలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథుల సేవకు మాత్రమే తమ సమయాన్ని పూర్తిగా కేటాయించుచున్నట్లు ప్రపంచములోని ప్రతి పెద్ద, క్రమ శిక్షణ గల జమాఅత్‌లో మనము చూస్తున్నాము. అల్లాహ్ తఆలా కృపానుసారము జర్మని జమాఅత్ విధేయత, విశ్వసనీయతలో చాలా ముందుండడమే కాక కొన్ని త్యాగములలో ఇతర జమాఅత్‌ల కంటే చాలా ముందంజలో వున్నది. అల్లాహ్ తఆలా వారి విధేయత, విశ్వసనీయతను మరింత పెంచుగాక! ఈ సారి పాల్గొను వారి సంఖ్య పెరిగినందున నిర్వాహకులకు, అమీర్ గారికి కూడ మన స్వంత సభా ప్రాంగణము వుండాలనే ఆలోచన కలిగినది. తామొక స్థలమును చూచినాము, దానిని కొనగోలు చేయుటకు ప్రయత్నించుచున్నామని అమీర్ గారు తెలిపినారు. అల్లాహ్ తఆలా దృష్టిలో అది మంచిదైనచో దానిని కొనుగోలు చేయుటకు, తీసుకొనుటకు కూడ ఏర్పాట్లు చేయుగాక! అడ్డంకులను తొలగించుగాక! హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇప్పుడు జర్మని జల్సా కూడ అంతర్జాతీయ స్థాయికెదిగినది. కావున సభా ప్రాంగణము, ఇతర ఏర్పాట్లు కూడ మరింత విశాలము కావలసియున్నది.

అతిథుల అభిప్రాయాలను తెలుపుచు హుజూరె అన్వర్ ఇట్లనిరి. శ్రీ Hans Oliver హేంజూవజు ఫ్రంక్‌ఫర్ట్ గారు ఒక లా ఫర్మ్‌లో సీనియర్ పార్ట్‌నర్. వీరు తమ అభిప్రాయములను వెల్లడించుచు ఇట్లనిరి. బాహ్య రూపంలో శాంతియుతంగా కొనసాగుచున్న రోజు వారీ పనులను అంచనా వేయుచు రాబోవు ప్రమాదాలను, యుద్ధమును గుర్తించుట చాలా గొప్ప విషయము. అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ భవిష్యత్తు ప్రమాదాలను సరిగ్గా అంచనా వేయడమే కాక ప్రపంచాన్ని కూడ చైతన్యపరుస్తున్నారు.

లుఫ్తాయిన్జ ఎయిర్ లైన్స్ ఐ టి విభాగములోని ఉద్యోగస్తురాలు శ్రీమతి Merina Pulbec గారు తమ అభిప్రాయాన్ని ఇట్లు తెలిపిరి. ప్రపంచ శాంతి స్థాపన గురించి ప్రసంగించుట నాయకులకు అతి ఇష్టమైన అంశము. కాని అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ ప్రసంగములో వున్నటువంటి శక్తిని నేనెక్కడ చూడలేదు. నిస్వార్థముగా చర్యలు చేపట్టనిచో అణు యుద్ధ భారీ వినాశనమునకు మనమే బాధ్యులగుదుము. ఎంత స్పష్టముగా సందేశము ఇచ్చినారనగా అసూయను వీడి ఆలోచించినచో మానవ రోమాలు జడుసుకొనుటకు ఈ హెచ్చరిక నా దృష్టిలో

సరిపోవును. నిర్ణయాలు తీసుకునే వారికి ఈ సందేశము అందించవలెను. మానవ విశాల ప్రగతి కొరకు ఈ సందేశమును అంతర్జాతీయ స్థాయిలో అర్థము చేసుకొనుట ఎంతో అవసరం.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. జల్సా గురించి మరికొన్ని అభిప్రాయాలలోని కూడ కొన్నిటిని తెలుపుతాను.

మెసిడోనియా బృందములోని ఒకరు శ్రీమతి అలెక్జాండర్ వాద్వీన గారిట్లు తెలిపిరి. ప్రజలు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలని, వారిలో ఐక్యత ఏర్పడాలని, వారు దేవుని సన్నిధికి చేరాలని అహ్మదియ్యా జమాఅత్ ఆశించుచున్నది. ఈ సంవత్సరం నేను జల్సా సాలానాలో ఎంతో మంచి వ్యక్తులను చూచినాను. చిరునవ్వుతో వారు మాకు సేవలందించుచుండిరి. దేవునిపై నమ్మకమున్న, గట్టి విశ్వాసమున్న వారిని నేను తలకించినానని కృతజ్ఞతాభావంతో తెలుపుచున్నాను. ఈ పుణ్య కార్యక్రమాలను మీరు కొనసాగింతురని నేను ఆశించుచున్నాను.

ఇదొక జమాఅతేతర అభిప్రాయము. ఈ అభిప్రాయము మనకు సూచించుచున్నదేమనగా మనము వాస్తవ రీతిలో మన జీవిత ఉద్దేశమును అర్థము చేసుకోవలెను. తదనంతరం దానిని పొందవలెను. మెసిడోనియా బృందములో వచ్చిన ఒక టి.వి. సాహిత్యకారులు జరాంచో జోరోన్స్కీ ఇట్లనిరి. నేను రెండవ సారి జల్సాలో పాల్గొన్నాను. ఇది నాకొక గొప్ప సత్కారము. జల్సా ఏర్పాట్లు చాలా అద్భుతంగా వున్నవి. ఇంకా ఇట్లనిరి. దేవుణ్ణి నమ్ముట, ప్రజలందరికి సహాయము చేయునటువంటి పనుల ద్వారా ప్రజలలో వున్న విభేదాలను దూరము చేయవచ్చును.

బల్గారియా బృందములో వచ్చిన ఒక క్రైస్తవ మహిళ జూలియా గారిట్లనిరి. అహ్మదియ్యా జమాఅత్‌లో వేలాది సభ్యులతో పాటు పాల్గొన్నందుకు నేను ఉత్సుకతకు లోనైనాను. నేను క్రైస్తవ మతస్తురాలినైనను మీ ప్రసంగము నాకు చాలా నచ్చినది. మీరు చేసిన ప్రార్థనలు మనసుకు హత్తుకుపోయెను. పవిత్ర ఖుర్‌ఆన్ పఠనము కూడ నాకు చాలా నచ్చినది. విద్యార్థులకు బహుమతులు కూడ మీరు మీ స్వహస్తాలతో బహుకరించట ప్రశంసించదగ్గ విషయము.

బల్గారియా బృందములో వచ్చిన మరొక మహిళ కీసమా అల్మీరా గారిట్లనిరి. మూడవ సారి జల్సా సాలానా జర్మనిలో పాల్గొను అవకాశము నాకు లభించినది. ప్రతి సంవత్సరం క్రొత్త క్రొత్త విషయాలను నేర్చుకొంటున్నాను. ఉపన్యాసాలను నేను చాలా శ్రద్ధగా వింటాను. ఎందుకనగా నేనొక ఫిజియోథెరపిస్టును, సైకాలజిస్టును కూడ. ఈ ఉపన్యాసాలలో తెలుపబడే అహ్మదియ్యా జమాఅత్ బోధన ద్వారా నేను నా ప్రతి రోగి సమస్యలను ఉత్తమ రీతిలో పరిష్కరించగలను. నేను నా కొరకు కూడ మంచి ఉపదేశములను సమకూర్చుకొని వెళ్తాను.

మరో అహ్మది మిత్రులు గజమ్ అజాచి గారు గతములో 'అధర్మ సంస్థ'కు చెందియుండిరి. వారికి జమాఅత్‌తో పరిచయమైనది. ధర్మము గురించి ప్రత్యేకంగా ఇస్లాం అహ్మదియ్యా జమాఅత్ వివరించే నిదర్శనములు వారికి చాలా నచ్చినవి. ఇంతకు ముందు మౌల్వీల కథల వలన వారు ధర్మము పట్ల విసుగు చెంది యుండిరి. వారు కొన్ని సంవత్సరాల క్రితం బైఅత్ చేసిరి. క్రమ క్రమంగా ఇస్లామీ పద్ధతులకు అలవాటు పడిరి. వారిట్లనిరి. జల్సా సాలానా నాకు చాలా నచ్చినది. ఏర్పాట్లు, అతిథి మర్యాదలు ప్రతి సంవత్సరం మాదిరిగానే చాలా గొప్పగా యుండెను. లజ్నలో నేను చూసిన ఉపన్యాసము, ముగింపు ఉపన్యాసము గురించి వారిట్లనిరి. ఇవి నన్ను చాలా ప్రభావితం చేసినవి. ఈ సందేశమును పురుషులైన మనము ఎల్లప్పుడు గుర్తుంచుకోవలెను.

జర్మనిలో నివాసముంటున్న మరో అతిథులు ఈలి శివాన్చి అల్‌బానియన్ ఇట్లనిరి. జల్సా సాలానా ప్రతి అహ్మది ముస్లిం కొరకు ఒక గొప్ప ఆధ్యాత్మిక సమావేశము. జల్సా సాలానాలో పాల్గొన్నందున ఒక వైపు ఇస్లాం ప్రాథమిక బోధన గురించి నాకు అవగాహన ఏర్పడినది. మరో వైపు అహ్మదియ్యా జమాఅత్‌లో వున్నటువంటి ఖిలాఫత్ వ్యవస్థ ద్వారా ఆయా బోధనలను ఆచరణాత్మక ఉదాహరణలను చూచే అనుభవము కలిగినది. ఒక అహ్మది ముస్లింగా నేను సంవత్సరం పొడుగునా ఈ ఆధ్మాత్మిక సమావేశము కొరకు నిరీక్షించుచుంటాను. ఇక్కడ కనిపించుచున్న నిజమైన సోదరభావమును వివరించుట అసాధ్యము. ఈ సభలో పాల్గొని నేను స్వర్గములో వున్నట్లు, ప్రపంచములో అందరికంటే అదృష్టవంతుడనని భావిస్తాను. రాబోవు సంవత్సరం సభ కొరకు నేను చాలా ఆత్రుతతగా ఎదురుచూస్తాను.

జార్జియా బృందములో ధార్మిక విద్యల విద్యార్థిని నానూకా గారు కడూ యుండిరి. వారు బైఅత్ వేడుకగురించి ఇట్లనిరి. బైఅత్ వేడుక గురించి నేను నా మనోభావాలను వెల్లడించుచున్నాను. ధార్మిక ఐక్యత దృశ్యము నాకిక్కడ

కనిపించినది. విభిన్న కులము, జాతులకు చెందిన వ్యక్తులు ఎలా శాంతియుతంగా వుండగలరో నాకు అర్థమైనది. నేను ధార్మిక విద్య అభ్యసించుచున్నాను. జల్సకు మొదటి సారి వచ్చినాను. ఈ జల్స శాంతి స్థాపనకు ఒక గొప్ప మార్గమని నేను విశ్వసించుచున్నాను.

కొసోవో నుండి వచ్చిన బృందములోని ఒక మిత్రులు శ్రీ షీబ్ జకర్జీ గారిట్లనిరి. జల్సలో పాల్గొను సమాచారము అందుకొని నేను చాలా ఆనందానికి లోనైతిని. కాని ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించుకొని నేను చాలా సందిగ్ధానికి లోనైతిని. కాని జల్సలో పాల్గొనుట, వర్తమాన ఖలీఫాతో భేటి అగుటకు నేను ఆత్రుతపడుచుంటిని. కావున నేను నా ఆవును విక్రయించి జల్సలో పాల్గొను ఖర్చులకు డబ్బు సమకూర్చుకొంటిని. అహ్మదీయులైన తర్వాత ఈ విధంగా కూడ త్యాగములు చేసి జల్సలో పాల్గొనుటకు ప్రజలు ప్రయత్నింతురు.

మాల్టా నుండి వచ్చిన ముగ్గురు మహిళలు స్త్రీల సభా ప్రాంగణమును సందర్శించిరి. వారిట్లనిరి. మాకు చాలా మంచి మర్యాదలు చేసినారు. స్త్రీల సభా ప్రాంగణములో ఒక కుటుంబ వాతావరణముండెను. మేము పరస్పరం దశబ్దాలను నుండి తెలుసు అన్నట్లు మేము అక్కడి యుంటిమి. కాని మేము మొదటిసారి భేటి అగుచుంటిమి. స్త్రీల సభా ప్రాంగణములో చాలా సౌలభ్యముండెను. రెండు ప్రాంగణముల వాతావరణమును గమనించే అవకాశము మాకు లభించెను. ఇస్లామీ బోధనల అనుసారము స్త్రీ, పురుషులకు వేర్వేరు ఏర్పాట్లు చేయుటలో గల గొప్ప వివేకము, తత్వమును సరియైన రీతిలో అర్థము చేసుకొను అవకాశము లభించినది. స్త్రీలు విడిగా వున్నందున చాలా మంచి సౌకర్యము, మనశ్శాంతిని భావించుచున్నారు. తమ ఏర్పాట్లను చూసుకొను, తమ ప్రతభా సామర్థ్యమును చూపించుకొనుటకు విశాల అవకాశము వారికి లభించుచున్నది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. స్త్రీ, పురుషులకు విడి విడిగా చేసిన ఏర్పాట్లు ఎంతో అవసరమని ఇప్పుడు ఇతరులు కూడ అంగీకరించుచున్నారు. ఒకే చోట ఎందుకు లేరని, స్వాతంత్ర్యయమెందుకు లేదని మనలోని కొందరు నవయువతకు ఆలోచన కలుగుతుంది. వారీ విషయమును గ్రహించవలెను.

ఖర్ఘిస్తాన్ నుండి వచ్చిన ఒక అతిథి ఇట్లనిరి. జల్సలో పాల్గొన్నందుకు అసాధారణ భావనలు కలిగినవి. అహ్మది కాక ముందు నేనెన్నడు ఏడ్వలేదు. కాని ఖాదియాన్, జర్మనిలో మాత్రమే ఏడ్చినాను. మనసులో ఒక మృదువైన మార్పు ఏర్పడుచున్నట్లు తెలుస్తుండెను. బైఅత్ చేసిన ప్రతి ఒక్కరి విశ్వాసము పెరుగుచున్నది. నేను గతంలో మౌల్వీగా యుంటిని. కాని అహ్మదియ్య జమాఅత్ పుస్తకములను చదివిన తర్వాత దజ్జాల్, మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గురించి పవిత్ర ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడిన విషయములన్ని అర్థమైనవి. నాపై చల్లని నీరు పడుచున్నట్లు, ఇప్పుడు నేను స్వచ్ఛమైన, నిజమైన ముస్లిం అయినట్లు నేను బైఅత్ సందర్భమున భావించితిని.

సెనిగాల్ నుండి వచ్చిన మరొక అతిథి ఇట్లనిరి. నేను జల్స చూడనిచో, మిమ్ములను దర్శించనిచో నా జీవితములో ఎంతో కోల్పోయేవాడిని. ఇప్పుడు నా జీవిత లక్ష్యము నెరవేరినదని నేడు నేను భావించుచున్నాను.

వారొక పడవ తమ జోలిలో పెట్టుకొని కూర్చొని వుండిరి. నేను అడగగా వారిట్లనిరి. ఇదొక కానుక. దీనిని మేము మీ కొరకు తీసుకొచ్చినాము. ఈ పడవ శాంతి పడవ. ప్రేమ అందరికి ద్వేషము ఎవ్వరితో లేదు అను పడవ ఇది. ఇందులో ఎక్కినవాడే శాంతి పొందును. ఇది అహ్మదియ్యత్ పడవ. పడవ కానుకగా ఇచ్చుటకు మరో భావమేమనగా మన దేశ ఆర్థిక వ్యవస్థ దీనితో ముడివున్నది. అక్కడ పడవ నడుపు వారు ఎక్కువ వున్నారు. కనుక మన దేశము కొరకు ప్రత్యేక దుఆ చేయండి.

బోసిన్యా నుండి వచ్చిన యాసీన్ సిపాచిత్ ఇట్లనిరి. మీ వాఖ్యములలో ఇస్లాం, ఇస్లాం వ్యవస్థాపకుల పట్ల మీ ప్రేమ, ప్రేమను పంచుచున్నారని తెలుస్తున్నది. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర గురించి మీ ఉపదేశము మనస్ఫూర్తిగా ప్రభావితం చేసెను. ఈ పనులే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చేసేవారు. వచ్చే జల్స ఇంత కంటే గొప్పగా జరగాలని నేను దుఆ చేయుచున్నాను. ఈ జల్స ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాజములో శక్తిని, ఐక్యతను కలిగించుటకు ఉపయోగపడుగాక!

శ్రీమతి యమీనా చాశ్వేస్ గారిట్లనిరి. ఆధ్యాత్మిక మృతుడైన వ్యక్తికి సజీవ ఆత్మ కలిగించు శక్తి, సామర్థ్యము జల్స వాతావరణములో యున్నదని ఈ జల్సలో పాల్గొని నేను తెలుసుకున్నాను.

కమాల్ లవాన్ లిబనాన్ గారిట్లనిరి. ఇంత పెద్ద సంఖ్యలో ఇంతటి చక్కటి ఏర్పాట్లు చేయుటయే నాకు ఈ జమాఅత్ సత్యమునకు మొదటి నిదర్శమైనది. వీరు ఖలీఫతుల్ ముస్లిమీన్ అని జల్సా సందర్భమున ఒక మిత్రుడు నాకిట్లు తెలిపెను. అనంతరం నేను అహ్మదీయులతో వివిధ ప్రశ్నలు అడిగితిని. వారు నాకెంతో ప్రేమపూర్వకగా సమాధానాలిచ్చిరి. నా హృదయము అహ్మదియ్యత్ సత్యముతో సంతృప్తి చెందినది. వచ్చే సంవత్సరం వరకు నేను బ్రతుకుతానో లేదో అని భావించి ఇప్పుడే బైఅత్ చేయాలని నిర్ణయించుకొని నేను బైఅత్ చేసితిని.

ఫువాద్ గారిట్లనిరి. 2018 సం॥లో నేను బైఅత్ చేసినాను. కాని నా భార్య బైఅత్ చేయుటకు నిరాకరించెను. నీవు ఈ పుస్తకములను చదువు, ఇస్తిఖార చేసి అల్లాహ్ తఆలాతో సహాయము కోరుమని చెప్పితిని. మూడు నెలలు నా భార్య ఇస్తిఖార చేసెను. అనంతరం ఆమె స్వప్నములో ఇట్లు చూచెను. ప్రజలు ఒక చోట గుమికూడిరి. వారి మధ్యలో ఒక తెల్లటి పావురం వున్నది. ఈ పావురం ఏమిటని నా భార్య అడిగెను. ఇస్లాం ప్రచారము కొరకు ఈ పావురం ఖుదుస్ ప్రాంతమునకు వచ్చినదని ఒకరు సమాధానమిచ్చిరి. ఈ స్వప్నము వలన నా భార్యకు సత్యము తెలిసిపోయినది. ఈ జల్సా అనగా 2019 సం॥లో పాల్గొని ఆమె బైఅత్ చేసినది. నా కుటుంబం మొత్తం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసినందున నాకు చాలా ఆనందము కలుగుతుంది. ఇప్పుడు నేను నా బంధువులందరికి కూడ సమాచారము అందించెదను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ బైఅత్ చేసిన వారి విధేయత, విశ్వాసము, నమ్మకమును అల్లాహ్ తఆలా మరింత పెంచుగాక! మనలోని ప్రతి ఒక్కరు కూడ జల్సా శుభముల నుండి లబ్ది పొందేటట్లు చేయుగాక! మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దుఆలకు వారసులుగా చేయుగాక!

మీడియా కవరేజ్ గురించి హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ సంవత్సరం జర్మనిలో మొత్తం 13 మీడియా ఔట్ లెట్స్ ద్వారా జల్సా కవరేజ్ చేయబడినది. ఇంకా ఇటలీ, స్లావస్కాయాలో ఆన్ లైన్ వార్తలు కూడ ప్రసారమైనవి. వీరి అంచనా ప్రకారము 2 కోట్ల 26 లక్షల మందికి సమాచారము అందినది.

అల్లాహ్ తఆలా కృపానుసారము చాలా పెద్ద స్థాక్షిలో జమాఅత్ పరిచయం అయినది. అల్లాహ్ తఆలా అన్ని విధాలా శుభదాయకము చేయుగాక!

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

..........................................................................

..........................................................................

..........................................................................